సాక్షి
వికారాబాద్
సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



అభివృద్ధి చేయండి

రూ.10వేలకోట్ల నిధులతో కొడంగల్‌ను ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేయాలని పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఘనంగా బ్రహ్మోత్సవాలు

షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. 8లో▸



ప్రయాణం ఎలా?

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా గ్రామీణ ప్రాంత రహదారులు దుస్థితి మారడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు కేంద్ర మంత్రి పర్యటన



ఆధార్ సేవలకోసం బారులు తీరిన ప్రజలు

మోమిన్‌పేట: మండల పరిధిఓని చీమల్‌దరి గ్రామంలో కేంద్ర సమాచార శాఖ మంత్రి దేవ్ సిన్హ్‌చౌహాన్ మంగళవారం పర్యటించనున్నట్లు మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో అభివృద్ధి పనులు పరిశీలిస్తారని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా బీఎస్ఎన్‌ఎల్‌తో చీమల్‌దరి పంచాయతీ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామంలో ఉచిత వైఫై, ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం, ల్యాండ్ లైన్ కనెక్షన్, ఆధార్ కేంద్రం పనితీరు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో డిజిటల్ బోధన తదితరాలపై వివరిస్తామన్నారు.

రాఘవన్‌నాయక్‌కు నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాఘవన్‌నాయక్

అనంతగిరి: బహుజన సాహిత్య అకాడమి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అందించే సంత్ సేవాలాల్ మహరాజ్ నేషనల్ అవార్డును అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కె.రాఘవన్ నాయక్ అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించిన బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమి నేషనల్ ప్రెసిడెంట్ నల్లా రాధాకృష్ణ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీడీఓలకు బదిలీలు

11 స్థానాల్లో కొత్తవారికి కేటాయింపు

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓలను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో సైతం పలువురు ఎంపీడీఓలు బదిలీ అయ్యారు. బండి లక్ష్మప్ప, ఉమాదేవి, బాలయ్య సిద్దిపేట జిల్లాకు, తులసీజయరాం, సుదర్శన్‌రెడ్డి, శేషగిరిశర్మ, తిరుమల స్వామిని నల్గొండ జిల్లాకు చేయగా, లక్ష్మీనారాయణ జనగామ జిల్లాకు, రంగారెడ్డి జిల్లాకు శైలజ, నాగవేణి యాదాద్రి భువనగిరి జిల్లాకు, యం.సత్తయ్య సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. కాగా రంగారెడ్డి జిల్లా నుంచి నర్సింలు, విజయలక్ష్మి, హరీశ్‌కుమార్, వినయ్‌కుమార్, రామకృష్ణ, రాఘవులు, అనురాధ, మహేశ్‌బాబు, సంగారెడ్డి జిల్లా నుంచి రాములు, విశ్వప్రసాద్, యాదాద్రి భువనగిరి నుంచి ప్రభాకర్‌రెడ్డిలు వికారాబాద్ జిల్లాకు రానున్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే, మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో ఆదివారం 5వ తరగతి ప్రవేశాలకు పరీక్ష నిర్వహించారు. పట్టణ శివారులోని బీసీ గురుకుల పాఠశాలలో 240మంది విద్యార్థులకుగాను 227మంది పరీక్షలు రాయగా.. 13 మంది గైర్హాజరయ్యారని పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ శంకర్‌బాబు తెలిపారు. పాతకొడంగల్ శివారులోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 408మంది విద్యార్థులకుగాను 390మంది పరీక్షలకు హాజరయ్యారని, 18మంది గైర్హాజరయ్యారని పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ ఈ.బలరాం తెలిపారు.

ఎయిర్‌పోర్టులో కారు బీభత్సం

శంషాబాద్: ఆగిఉన్న కారును మరో కారు ఢీకొట్టిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున విమానాశ్రయంలోని మొదటి రోటరీ సమీపంలో హైదరాబాద్ వైపు వస్తున్న ఓ కారు డ్రైవర్ వాహనాన్ని నిలిపాడు. వెనక వేగంగా వచ్చిన మరో కారు ఆగి ఉన్న కారును గమనించకుండా ఢీకొట్టడంతో రెండు కార్లు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న గుంతలోకి పడిపోయి నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో నిలిపి ఉన్న కారులోని వ్యక్తి గాయాలయ్యాయి. ఢీకొన్న కారులోని నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. రోడ్డుపై బీభత్సం సృష్టించడంతో వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని కార్లను తొలగించడంతో పాటు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వెనక నుంచి కారును ఢీకొట్టిన వారు మద్యం మత్తులో ఉన్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యాసంగి సాగు తగ్గిపాయె!

ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. గతేడాది 2.30లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా.. ఈ ఏడాది 70వేల ఎకరాలు మించి సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ శాఖ సిద్ధం చేసిన ప్రణాళికల్లో ఈ విషయం స్పష్టమవుతోంది.



మూడేళ్లుగా అందని రాయితీ విత్తనాలు

- 70 వేలకు పరిమితం కానున్న సాగు
- మొదటి విడత ఎరువుల సరఫరా పూర్తి
- యాసంగి ప్రణాళికలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

వికారాబాద్: అన్నదాతలు యాసంగి సాగులో తలమునకలయ్యారు. ప్రధాన పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు లాంటి సాగులో ఇప్పటికే విత్తనాలు వేయడం పూర్తి చేశారు. వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగిలో సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖ కసరత్తు చేశామని చెబుతోంది. అయితే గతంతో పోలిస్తే ఈ ఏడాది యాసంగి సాగు గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. వేరుశనగ (పల్లి), శనగ విత్తనాలను సబ్సిడీపై అందజేసే సర్కారు మూడేళ్లుగా చేతులెత్తేసింది. ఈ సీజన్‌లోనూ అదే అనవాయితీ కొనసాగింది. కాగా జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు ఆలస్యంగా వేసుకుంటారు. ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో యాసంగి సాగు పూర్తి కాగా మన జిల్లాలో ఇంకా కొనసాగుతోంది.

తగ్గనున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో మొత్తం 2.95 లక్షల మంది రైతులు ఉన్నారు. 5.8 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా యాసంగి సీజన్‌లో గతంలో 2.30లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేసేవారు. వ్యవసాయ శాఖ ప్రతీ సంవత్సరం రైతుల పంటల సాగుకు అనుగునంగా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 70వేల ఎకరాలకు మించి సాగయ్యే అవకాశం కనిపించడం లేదు. సీజన్ ప్రారంభమయ్యాక వర్షాలు కురియక పోవడంతో సాగువిస్తీర్ణం తగ్గిందని అధికారులు భావిస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

రబీ సీజన్‌కు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంఓపీ (మ్యూరిట్ ఆఫ్ పొటాష్) జిల్లాలో అందుబాటులో ఉంచారు. జిల్లాకు రబీ సీజన్‌లో పలు రకాల ఎరువులు 42వేల మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు నివేదించగా, మొదటి విడతలో 50శాతం ఎరువులు ప్రభుత్వం సరఫరా చేసింది. ఎరువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా స్టాక్ అయిపోతే వెంటనే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా ఎరువులు అక్రమార్గం పట్టకుండా ఉండడానికి గాను లైసెన్సు ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలకు జిల్లాలో గతంలోనే ఈ–పాస్ యంత్రాలను అందేజేయగా వాటిని పర్యవేక్షిస్తున్నారు.

సాగు వివరాలు

పంట రకం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
వేరుశనగ	13,444
శనగ	5,628
పొద్దుతిరుగుడు	2,551
వరి	30,000

ఎరువుల కొరత లేదు



రబీ సీజన్‌కుగాను ఈ నెలాఖరు వరకు విత్తనాలను వేసుకోవచ్చు. వర్షాలు సమృద్ధిగా కురువనందు వల్ల సీజన్ ఆశాజనకంగా కనిపించటంలేదు. సాధారణ విస్తీర్ణం కంటే తక్కువగానే ఈ ఏడాది పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉన్నాయి. మిగతా పంటలు సాగు చేసే అదును ఇప్పటికే పూర్తయ్యింది. వాతావరణ పరిస్థితుల వల్ల జిల్లాలో వరి ఆలస్యంగా సాగు చేశారు. 70 శాతం వరకు సాగు పూర్తయింది. వరి ఈ నెలాఖరు వరకు సాగు చేయవచ్చు.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

కొడంగల్ అభివృద్ధికి జీఓలు

విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తూ ఉత్తర్వులు

కొడంగల్: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌పై జీఓల జల్లు కురుస్తోంది. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక జీఓలను విడుదల చేస్తోంది. ఆదివారం సైతం పలు ఉత్తర్వులను విడుదల చేశారు.

జీఓ నంబర్ 1: కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మారుస్తూ జీఓ నంబర్ 1 విడుదల చేశారు. ఇందుకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.20 కోట్లు భవనాల నిర్మాణానికి రూ.10 కోట్లు మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

జీఓ నంబర్ 2: కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. ఇందుకు రూ.11కోట్లు మంజూరు చేశారు.

జీఓ నంబర్ 3: దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేశారు. ఒక్కో కళాశాలకు భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలకు ఒక్కో మండలానికి రూ.7.13 కోట్ల చొప్పున రెండు మండలాలకు కలిపి రూ.14.26 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బి.వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు.

జీఓ నంబర్ 6: కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్, ప్రభుత్వ నర్సింగ్, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలను మంజూరు చేశారు. ప్రతీ ఏడాది 50 సీట్లు చొప్పున భర్తీ చేస్తారు. భవన నిర్మాణాలు మౌలిక సదుపాయాల కోసం రూ.12,450లక్షలు మంజూరు చేశారు. నర్సింగ్ కళాశాలలో 60 సీట్లు, ఫిజియోథెరపీలో 50 భర్తీ చేయాలని నిర్ణయించారు. నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణం, ఇతర అవసరాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.4,600 లక్షలు మంజూరు చేశారు. పారామెడికల్ కళాశాలకు అనుమతి ఇచ్చారు. ప్రతీ ఏడాది 30 సీట్లు భర్తీ చేస్తారు. ఇందుకు రూ.2,700 లక్షలు మంజూరు చేశారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇందుకు రూ.2,700 లక్షలు కేటాయించారు. ఈ మేరకు హెల్త్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ కార్యదర్శి డాక్టర్ క్రిష్టినా శాంగో ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణాల కోసం స్థలాలను పరిశీలిస్తున్నారు. త్వరలో భూ సేకరణ చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. నియోజకవర్గంలోని అసైన్డ్, అటవీ, నిరుపయోగ భూముల కోసం సర్వే చేస్తున్నారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటన ఖరారు అయ్యే వరకు భూ సేకరణ ఓ కొలిక్కి రానుందని అధికారులు చెబుతున్నారు.



కొడంగల్ ప్రభుత్వాస్పత్రి

విద్యార్థినులకు వైద్యసేవలు

- ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



వికారాబాద్ అర్బన్: విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: కలరా లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని.. వారి ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ లింగ్యానాక్ అన్నారు. ఆదివారం ఆయన మున్సిపల్ పరిధిలోని కొత్తగడి సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ అవర్ణను అడిగి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. జాండిస్ వల్ల విద్యార్థినులు అస్వస్తకు గురయ్యారని ప్రిన్సిపాల్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఇప్పటికే 61మంది విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడి వారి ఇళ్లకు వెళ్లారని.. మరో 12మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వారికి స్వచ్ఛమైన తాగునీరు అందించానలి ఆయన ప్రిన్సిపాల్‌కు సూచించారు. ముమ్ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అవగాహన కల్పించిన డీఎంహెచ్ఓ

అనంతగిరి: కొత్తగడిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాటశాలలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని ఆదివారం జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది విద్యార్థినులు అన్యారోగ్యానికి గురైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సమాచారం ఇవ్వడంతో వెంటనే తమ వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి రోజు పరీక్షలు చేస్తున్నారన్నారు. విద్యార్థినులు, అధ్యాపక సిబ్బంది, వంట కార్మికుల రక్త నమూనాలు సేకరించామన్నారు. తీవ్ర అనార్యోగానికి గురైన కొంతమంది పిల్లలను వికారాబాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించామన్నారు. అనంతరం అక్కడ విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు ప్రతిరోజు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఫాలో అప్ చేస్తున్నామన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

- పార్టీ అభ్యర్థి ఎవరైనా భారీ మెజార్టీ
- చేవెళ్ల నుంచి బీసీలకు అవకాశం ఇవ్వాలి

తాండూరు: చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఎవరైనా భారీ మెజార్టీ ఖాయమని పార్టీ నేత, మాజీ మంత్రి తనయుడు నరేశ్ మహరాజ్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మహరాజ్ మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో పదికి పైగా స్థానాలు గెలుపొందడం ఖాయమన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లో బీసీ ఓటర్లు అధికంగా ఉన్నందున తనకు పార్టీ టికెట్ కేటాయించాలని కోరారు. ఈ సెగ్మెంట్ నుంచి ఇప్పటి వరకు బీసీలకు అవకాశం కల్పించలేదన్నారు. ఇప్పటికే బీసీలకు పెద్దపీట వేస్తామని అధిష్టానం చెప్పిందని.. తాను గెలిచే అవకాశం ఉన్నందున టికెట్ కేటాయించాలని కోరానన్నారు. తాను పార్టీ క్రమశిక్షణ పాటిస్తానని పదవులు వచ్చినప్పుడే స్వీకరిస్తానని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నుంచి జనసేన అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో పార్టీకి నష్టం వాటిల్లిందన్నారు. తాండూరులో పార్టీ బలోపేతానికి సమయం కేటాయిస్తానన్నారు. వారం రోజుల్లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి భవన నిర్మణానికి పట్టిన ఇసుక లెక్కలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా పట్టణంలోని రోడ్డు విస్తరణ పనుల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర మంత్రులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో బిజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాకీర్ జహీర్ అబ్బాస్, జిల్లా అధికార ప్రతినిధి వెంకట్, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేశ్ మహరాజ్

ఎరువు కరువు

- మార్కెట్‌లో కృత్రిమ కొరత
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయాధికారులు



పెద్దేముల్‌లో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

పెద్దేముల్: ప్రభుత్వాలు మారిన అన్నదాతల బతుకులు మారడం లేదు. సమయానికి ఎరువులు, విత్తనాలు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో క్రిబ్‌కో, పెద్దేముల్ రైతు సేవా, తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘాల నుంచి రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసేవారు. రెండేళ్లుగా మండల పరిధిలో యూరియా, డీఏపీ కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నుఆరు. చేసేదేమీ లేక రైతులు తాండూరు, వికారాబాద్, కుంచారం ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇదే విషయమై వ్యవసాయాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా చెరుకు, వరి తదితర పంటలకు వేయాల్సిన యూరియా లభించక అన్నదాతలు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూతబడిన ఆగ్రో సెంటర్‌ను తెరిచి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధిక ధరలకు అమ్మకాలు

మండల పరిధిలో 30 రెవెన్యూ గ్రామాలుండగా సుమారు 44 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇక్కడ అధికంగా చెరుకు, వరి, పత్తి, కంది, అరటి తదితర పంటలు సాగు చేస్తారు. ఇందుకు ప్రతీ ఏడాది సుమారు వెయ్యి టన్నుల వరకు యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువులు అవసరం ఉంటాయి. ఒక తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘంలో తప్ప యూరియా మిగిలిన సంఘాల్లో అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. ఫర్టిలైజర్స్ షాపుల్లో ఒక్కో బస్తాకు రూ.50 నుంచి రూ.70వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తా రూ.270 ఎమ్మార్పీ ధర ఉండగా.. మార్కెట్‌లో రూ.320 నుంచి రూ.350 వరకు ధర పెంచి విక్రయిస్తున్నారు. ధరపై ప్రశ్నిస్తే ఎరువులు లేవని.. స్టాకు ఉందని చెబితే ఆసాముల పేరిట దుకాణ యజమానులు తప్పించుకుంటున్నారు. రైతులకు ఎరువులు అందకుండా ప్రభుత్వం ఎన్ని పథకాలు పెట్టిన లాభం ఉండదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎరువుల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆగ్రోస్‌ను తెరిపించండి



మూతబడిన ఆగ్రోస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఎరువుల కోసం ఎదురుచూడకుండా రైతుల సమస్యలు పరష్కరించాలి.

– రాంచంద్రయ్య, రైతు, బండమీదిపల్లి

60 బస్తాలు అవసరం



పంటలు చేతికి వచ్చే వరకు సుమారు 60కి పైగా యూరియా, పొటాష్, డీఏపీ ఎరువులు అవసరం. తట్టెపల్లి పీఏసీఎస్‌లో ఎరువులు అందుబాటులో లేకుంటే తాండూరు, కర్ణాటక రాష్ట్రం కుంచారం, షాదీపూర్‌కు వెళ్లి ఖరీదు చేయాల్సి వస్తోంది. సమయంతో పాటు డబ్బు వృథా అవుతుంది. సమస్య పరిష్కరించాలి.

– వెంకట్‌రెడ్డి, రైతు, అడ్కిచెర్ల

రెండు రోజుల్లో వస్తుంది



తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తప్ప మండలంలో ఎక్కడ యూరియా లేదు. పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో ఉంచాలని పలుమార్లు వారికి సూచించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో యూరియా అందుబాటుల్లో ఉండేల చర్యలు తీసుకుంటా.

– నజీరుద్దీన్, ఏఓ, పెద్దేముల్

ఇదేనా సంక్షేమ బడ్జెట్?

- అరకొర నిధులతో సరిపెట్టారు
- ఆయా హామీలపై స్పష్టత కరువు
- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాంతకుమార్

షాద్‌నగర్: ప్రజా సంక్షేమానికి బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించిందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ విమర్శించారు. పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలకు రూ.5లక్షల కోట్లకు పైగా అవసరం ఉంటే రూ.53వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తామని, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ రంగాలకు గతంలో కంటే తక్కువ నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు అందజేస్తామని ఎన్నికల ముందు చెప్పి బడ్జెట్‌లో ఎందుకు ప్రస్తావించలేదని ఆయన ప్రశ్నించారు. బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని.. బడ్జెట్‌లో రూ.8వేల కోట్లు మాత్రమే కేటాయిస్తున్నట్లు ప్రకటించడం మోసం చేయడమేనన్నారు. ఉద్యకారులను గుర్తించి, వారి కుటుంబాలకు నెలవారీ గౌరవ పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని అన్నారు. తొలి కేబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు పోస్టుల భర్తీపై స్పష్టత లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లిస్తామని, ఇంటి స్థలం ఉంటే ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సరిగా లేకపోవడాన్ని చూస్తుంటే హామీలను విస్మరించే ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పినా ఎందుకు నిధులు కేటాయించలేదని నిలదీశారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని, తిరిగి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, చెంది మహేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహ, శంకర్‌నాయక్, హరి భూషణ్ పద్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


సీఐ, ఎస్సైలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పరిగి: అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి సీఐగా శ్రీనివాస్, ఎస్సైగా సంతోష్‌కుమార్‌లు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని..

ద్విచక్ర వాహనదారుడు మృతి



బొంరాస్‌పేట: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని రేగడిమైలారం శివారులో కొడంగల్ సరిహద్దు వద్ద జాతీయ రహదారి163పై హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీ గేర్‌బాక్సు చెడిపోవడంతో రోడ్డుపై ఆగింది. కొడంగల్ మండల పరిధిలోని చిన్ననందిగామ పంచాయతీ బుర్జుఖాన్‌పల్లికి చెందిన కృష్ణ(35), బైక్ వేగంగా వెళ్లి లారీని ఢీకొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతర వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎండీ.రవూఫ్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పరిగి ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


నరేష్(ఫైల్)

పరిగి: బైక్, ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఒకరు మృతి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని రంగంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపల్లి గ్రామానికి చెందిన కృష్ణమోని నరేష్(20), సాయికిరణ్, సతీష్‌లు బైక్‌పై పరిగికి వెళ్తుండగా రంగంపల్లి గేట్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న కృష్ణమోని నరేష్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు.

సీఈఐఆర్‌తో ఫోన్ రికవరీ

యాలాల: సీఈఐఆర్ యాప్‌తో వ్యక్తి పాగొట్టుకున్న ఫోన్‌ను యాలాల పోలీసులు రికవరీ చేశారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పగిడియాల గ్రామానికి చెందిన క్రిష్ణ తన స్మార్ట్ ఫోన్‌ను ఇటీవల పాగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా పాగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఐ శంకర్ బాధితుడికి ఫోన్‌ను అప్పగించారు.

పార్టీని వీడే ప్రసక్తే లేదు

- జీఆర్‌ఎస్‌లోనే ఉంటా..
- 10 వేల కోట్లతో అభివృద్ధి చేయండి
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్ : కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో రూ.10వేలకోట్ల నిధులతో తెలంగాణలోనే కొడంగల్‌ను ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని, ఇలాంటి అవకాశం మళ్లీ వస్తుందో, లేదో, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇండస్ట్రీల ఏర్పాటుతో పాటు కొడంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇండస్ట్రీ ఏర్పాటుకు వంద ఎకరాల స్థల పరిశీలన చేపట్టడం జరిగిందని, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను సుందరీకరణ చేయాలని, పట్టణంలోని శ్రీమహలక్ష్మి వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ 13వ తేదీన చేపట్టనున్న చలో నల్గొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. తాను పార్టీ వీడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచులు, ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, మాజీ సర్పంచు రమేష్‌బాబు, దౌల్తాబాద్ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నరేష్, సయ్యద్ అంజద్, యాదగిరి. నవాజొద్దీన్, పకీరప్ప పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: పట్టణంలో షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం 20వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అంగరంగా వైభవంగా షిరిడి సాయి శోభాయాత్ర, భజనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిమార్గాన్ని ఎంచుకోవాలని, భక్తితోనే ముక్తి లభిస్తుందని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల ఆధార్‌కార్డు, హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ఆదివారం ప్రభుత్వం ప్రవేశ పరీక్షను నిర్వహించింది. ఈ వీటీజీ సెట్ పరీక్ష ఉ.11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాలయాలలో 5వ తరగతిలో ప్రవేశం పొందుటకు వీటీజీ సెట్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే చేరుకున్నారు. హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, బోనఫైడ్, పరీక్ష ప్యాడ్ తనిఖీచేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. కమ్మదనం గురుకుల బాలికల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో 480 మంది విద్యార్థులకుగాను 438 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 42 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బాలురు 236 మందికి గాను 214 మంది, బాలికలు 244 మందికిగాను 224మంది హాజరయ్యారు. అలాగే సాంఘిక సంక్షేమ గిరిజన మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో 312 మంది విద్యార్థులకుగాను 286 మంది పరీక్షకు హాజరు కాగా 26మంది గైర్హాజరయ్యారు. బాలురు 149 మందికిగాను 133 మంది, బాలికలు 163మందికి గాను 153 మంది హాజరయ్యారు. కమ్మదనం పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌గా ప్రసన్న, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా వీణ, గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో సిట్టింగ్ స్క్వాడ్‌గా గంగ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా భార్గవి వ్యవహరించారు. వీటీజీ సెట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కావాల్సిన చర్యలను అధికారులు చేపట్టారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మెల్సీ కవిత ధర్నాను బహిష్కరిస్తున్నాం

బీజీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



తాండూరు టౌన్ : నేటి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధర్నాను బహిష్కరిస్తున్నట్లు బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9ఏళ్ల పాలనలో అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఎందుకు పెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ కవిత బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తోందన్నారు. అంత ప్రేమ ఉంటే అప్పట్లో ప్రత్యేక బీసీ బడ్జెట్‌ను ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. ధర్నాచౌక్‌ను ఎత్తేయించిన బీఆర్‌ఎస్ అదే ధర్నా చౌక్‌లో ధర్నాకు దిగడం సిగ్గు చేటన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్సీ కవిత బీసీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తూ కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. నేటి ఎమ్మెల్సీ కవిత ధర్నాకు బీసీలు మద్దతు తెలిపేది లేదని, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో బీసీల ఆత్మగౌరవం కోసం తాము పోరాడుతూనే ఉంటామన్నారు.

మహిళ అదృశ్యం


లక్ష్మి (ఫైల్)

తాండూరు రూరల్: ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యం అయిన ఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతపూర్ శివారులోని ఓ పాలిషింగ్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన అడికె ఆశప్ప భార్యలక్ష్మి గత కొన్ని సంవత్సరాలుగా తాండూరు మండలం గౌతపూర్ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్‌లో కార్మికులుగా పని చేస్తున్నారు. ఈ నెల 9న లక్ష్మి ఆరోగ్యం బాగ లేదని తాండూరు జిల్లా ఆస్పత్రికి వెళ్లి వస్తానని భర్త ఆశప్పకు చెప్పి వెళ్లింది. ఆస్పత్రికి వెళ్లిన లక్ష్మి ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో భర్త ఆశప్ప ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన బాలకృష్ణ బండవెల్కిచర్ల నుంచి కుల్కచర్లకు వస్తుండగా కుల్కచర్ల నుంచి రాంనగర్ వైపు వెళ్తున్న రాజు అనే వ్యక్తి బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలకృష్ణ(21) తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంగా మృతి చెందాడు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాండూరు రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ పురుగుల మందు తాగింది. దీంతో ఆమె హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన డప్పు మోతిభాయి(52), కొన్ని రోజులుగా కడపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 7వ తేదీన కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగింది. దీంతో వెంటనే తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మోతిభాయి మృతి చెందింది. ఆమె కొడుకు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూపులు!

- బడ్జెట్ సమావేశాలతో కాంగ్రెస్ నాయకులు బిజీ
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరేందుకు రంగం సిద్ధం

తాండూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునితారెడ్డి దంపతులు బీఆర్‌ఎస్‌ను వీడి, కాంగ్రెస్ పార్టీలో చేరికకు అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్రంలో బడ్జెట్ సమావేశాలు జరుగుతుండటంతో కాంగ్రెస్ నేతలంతా బిజీగా ఉన్నారు. మరో పక్క రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. దీంతో పట్నం దంపతుల చేరిక మరోవారం రోజుల వరకు వాయిదా పడిందని మహేందర్‌రెడ్డి వర్గీయులు అంటున్నారు. చేరిక ఆలస్యం కావడంతో ఒకేసారి ఉమ్మడి జిల్లాలో ఉన్న పట్నం వర్గీయులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో వేలాది మంది కార్యకర్తలతో వికారాబాద్ జిల్లాలోనే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నెల 16వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటనకు రానున్నారు. ఈ సమయంలోనే పట్నం దంపతులు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని పట్నం అనుచరులు చెబుతున్నారు.

ఆటో బోల్తా..

ఏడుగురికి గాయాలు


వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ శంకర్

యాలాల: వేగంగా ప్రయాణిస్తున్న ఓ ఆటో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండల పరిధిలోని అచ్యుతాపూర్ గేటు సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దాయిపేట నుంచి తాండూరుకు ఏడుగురు ప్రయాణికులతో ఓ ఆటో బయలుదేరింది. ఈ క్రమంలో అచ్యుతాపూర్ గేటు సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శంకర్ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మేకల రాజుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్ తెలిపారు.

వ్యభిచార గృహాలుగా ఫాంహౌస్‌లు!

- అద్దెకు తీసుకుని గుట్టుగా సాగిస్తున్న నిర్వాహకులు
- ఇతర ప్రాంతాల మహిళలను రొంపిలోకి దింపుతున్న వైనం
- పెడదారి పడుతున్న యువకులు


వ్యభిచారం నిర్వహిస్తున్న ఫాంహౌస్

మొయినాబాద్: వారాంతపు విడిదిలు వ్యభిచార గృహాలుగా మారుతున్నాయి. వీకెండ్‌లో సరదాగా గడపడానికంటూ నగర శివారు ప్రాంతాల్లో నిర్మించుకుంటున్న ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. అప్పుడప్పుడు పోలీసులు దాడిచేసి గుట్టురట్టు చేస్తున్నా మళ్లీ కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు ఫాంహౌస్‌లను లీజ్‌కు తీసుకుని వ్యభిచారం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో వాటికి ఆకర్షితులై యువత పెడదారి పడుతుంది. హైదరాబాద్ శివారుల్లోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో చాలా మంది బడాబాబులు ఫాంహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. 111 జీఓ పరిధిలో ఉన్న మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్ మండలాల్లో ఫాంహౌస్‌లు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఒక్క మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికి పైగా ఫాంహౌస్‌లున్నాయి. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలంలో చాలా మంది 10 గుంటల నుంచి 1 ఎకరం వరకు భూమి కొనుగోలు చేసి అందులో ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. వీకెండ్స్‌లో పిల్లలతో ఎంజాయ్ చేయడానికి ఫాంహౌస్‌లు నిర్మించుకుని తర్వాత వాటిని ఇతరులకు లీజుకు, అద్దెకు ఇస్తున్నారు.

నిర్వాహకుల అడ్డగోలు దందా..

ఫాంహౌస్‌లను అద్దెకు తీసుకున్న నిర్వాహకులు అడ్డగోలు దందాలు చేస్తున్నారు. గెట్ టూ గెదర్ పార్టీలు, ఫ్యామిలీ పార్టీలు, బర్త్‌డేలంటూ రోజువారీగా అద్దెకు ఇస్తున్నారు. ఫాంహౌస్‌లకు వచ్చే యువకులను ఆకర్షించే విధంగా ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి ఫాంహౌస్‌లలో ఉంచుతున్నారు. అమ్మాయిలను వ్యభిచారం రొంపిలోకి దింపి యువకుల దగ్గర డబ్బులు దండుకుంటున్నారు. మొయినాబాద్ మండలంలోని కనకమామిడి, చాకలిగూడ, సురంగల్, శ్రీరాంనగర్, తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, అప్పారెడ్డిగూడ, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, బాకారం, అమ్డాపూర్ తదితర గ్రామాల పరిధిలో ఉన్న ఫాంహౌస్‌లలో ఈ దందాలు జోరుగా కొనసాగుతున్నాయి.

నిఘా వైఫల్యం!

ఫాంహౌస్‌ల్లో జరుగుతున్న వ్యభిచారం, అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల నిఘా వైఫల్యమే కారణమని తెలుస్తుంది. ఫాంహౌస్‌లపై నిఘా పెట్టాల్సిన పోలీసులు నిర్వాహకులతో మిలాకత్ అవుతున్నట్లు సమాచారం. అందుకే ఫాంహౌస్‌ల్లో రాత్రిపూట ఎంత హంగామా జరిగినా పోలీసులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఎలుకగూడ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహించడం వల్ల యువకుల మధ్య జరిగిన గొడవలు ఓ యువకుడి ఆత్మహత్యకు దారితీసినట్లు సమాచారం. అప్పుడప్పుడు ఫాంహౌస్‌లపై జరుగుతున్న దాడులు ఎస్‌ఓటీ పోలీసులు చేస్తున్నవే కావడం విశేషం.

వరుస ఘటనలు...

మొయినాబాద్ మండలంలోని ఫాంహౌస్‌ల్లో వరుసగా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆరు నెలల క్రితం కనకమామిడి రెవెన్యూలోని మ్యాంగోహుడ్ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. తాజాగా గురువారం రాత్రి కనకమామిడి రెవెన్యూ పరిధిలోని హ్యాపీహోంస్‌లో ఉన్న రాజు ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, ఓ వాచ్‌మెన్, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పేకాట స్థావరాలపై సైతం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేస్తున్నారు.

నిఘా పెంచుతాం



ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. అన్ని ఫాంహౌస్‌లకు నోటీసులు ఇస్తాం. ఫాంహౌస్‌లపై నిఘా పెంచుతాం. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ఫాంహౌస్‌లపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటాం.

–పవన్‌కుమార్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండల అనాజ్‌పూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి విజయలక్ష్మి అనే మహిళ కుమారుడితో కలిసి అనాజ్‌పూర్ ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు వ్యాపించాయి. దీంతో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగి భారీ శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో వస్తువులు, నగదు కాలిపోయాయి. స్థానికుల పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ సహాయంలో మంటలను ఆర్పారు. బాధితురాలికి తక్షణ సహాయం కింద రూ. 5వేలు తహసీల్దార్ రవీందర్ దత్తు అందజేశారు.

కనుల పండువగా గరిగుట్ట పెద్దమ్మ జాతర


సమ్మక్క సారమ్మలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న శివశక్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారి 46వ కల్యాణ మహోత్సవాల(జాతర)లో భాగంగా ఆదివారం అమ్మవారి తొట్టెల ఊరేగింపును ధర్మకర్త విఠల్ బాబా పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాల నడుమ మహిళలు సంప్రదాయ వస్త్రాధారణతో బోనాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి వడిబియ్యాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న సమ్మక్క, సారక్కల దిమ్మెల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి, ఎస్సై భాస్కర్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.


గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారు

త్వరలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: త్వరలో మహేశ్వరంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు ఉంటాయని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్దాంతాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. త్వరలో మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లతో పాటు సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల నుంచి భారీ ఎత్తున బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరనున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు వెంకటేష్ గౌడ్, నర్సింహ, మురళి, కన్నయ్య, నర్సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.